# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 23 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఆరుగురు ఐపిఎస్‌లకు డిజి హోదా




**హైదరాబాద్, ఏప్రిల్ 22:** తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్‌కుమార్, సజ్జనార్ కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు



- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని మిగతా 3లో..

## ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం మిగతా 3లో..

## డిమాండ్లు పరిష్కరించకుంటే
# సమ్మె ఉధృతం

- ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు
- సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక మిగతా 2లో..

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ



- కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్ 22 :** నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లోఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

# అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లు

- భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ



**హైదరాబాద్,ఏప్రిల్ 22 :** తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ. 148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుప యోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారం భించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారంసచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో సబ్‌కమిటీ కీలక నిర్ణయాలు తీసు కుంది. 1:4నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టెండర్లు, పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

## ఇడి విచారణలో జోక్యం చేసకోవడమేంటి?



మమతా బెనర్జీ తీరుపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్‌స్టలెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నమోదైన మిగతా 3లో..

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం
- అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు
- ప్రభుత్వ వైఫల్యాన్న బయటపెట్టిన హైకోర్టు తీర్పు
- విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ మిగతా 3లో..

## కాళేశ్వరం కథ ముగియలేదు

- సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు
- బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో
- మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. మిగతా 3లో..

## అనిల్ జైన్‌పై చర్య తీసుకోండి

జలశక్తి మంత్రికి బండి లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కేంద్ర జల్‌శక్తి మంత్రికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావిం చారు. ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో ఆయన పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 20వ తేదీన రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి మేడిగడ్డను సందర్శించారని చెప్పుకొచ్చారు. ఆ కార్యక్రమంలో అనిల్ జైన్ ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. భవిష్యత్తులో బ్యారేజీలకు మరింత నష్టం జరిగితే.. ఎన్డీఎస్ఏపై కాంగ్రెస్ ప్రభుత్వం నిందమోపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కమిటీ సిఫార్సులను నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి చెడ్డపేరు తెచ్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహించారు. అనిల్ జైన్‌పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. మిగతా 3లో..

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

- రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 :** ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై మిగతా 3లో..

## కాలేశ్వరం అవినీతి జగమెరిగిన సత్యం

- అన్ని నివేదికలు ఇదే చెప్పాయి
- హైకోర్టు తీర్పుపై కోదండరామ్ వ్యాఖ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీజేఏసీ అధ్యక్షులు కోదండరాం స్పందించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి జరిగిందని, లోపాలు ఉన్నాయని కాగ్, విజిలెన్స్, ఎన్‌డఎస్ఏ రిపోర్ట్‌లు ఇచ్చాయని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. విచారణ చేయకపోతే సీబీఐదే తప్పవుతుందని టీజేఏసీ అధ్యక్షులు చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో తప్పు జరిగిందని తెలుస్తున్నప్పుడు చర్యలు తీసుకోడానికి ఇబ్బంది ఏంటని కోదండరాం ప్రశ్నించారు. 'బ్యారేజ్ నిర్మాణంలో పిల్లర్లు కుంగిపోయినవి మనకు కనిపిస్తుంది కదా... ఇంకేం కావాలి' అని అన్నారు. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు ఎవరకీ చెంపపెట్టు కాదని కోదండరాం స్పష్టం చేశారు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

- హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
- సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. మిగతా 3లో..

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్,హరీష్‌లకు ఊరట



- జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 22: కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చున్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

# ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

- హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రి హరీష్ రావు



హైదరాబాద్, ఏప్రిల్ 22: ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టలేం

- వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం
- శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్శీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంత వరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

# త్రిస్సూర్ బాణాసంచా పేలుడు ఘటన

## రాష్ట్రవిపత్తుగా ప్రకటించిన ప్రభుత్వం

తిరువనంతపురం,ఏప్రిల్ 22 : కేరళలోని త్రిస్సూర్‌లో బాణా సంచా పేలుడు ఘటనను విజయన్ ప్రభుత్వం బుధవారం రాష్ట్ర విపత్తుగా ప్రకటించింది. ఈ ఘటనను రాష్ట్ర విపత్తుగా కేరళ మంత్రివర్గం బుధవారం విపత్తు నిర్వహణ అథారిటీని ఆదేశించింది. ఈ ప్రమాదంపై న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ సి.ఎన్. రామచంద్రన్ నాయర్ నేతృత్వంలో న్యాయ కమిషన్ పర్యవేక్షించనుంది. మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల అత్యవసర ఆర్థిక సహాయం అందించనున్నట్లు విజయన్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుండి రూ.4 లక్షలు, సిఎం విపత్తు సహాయ నిధి (సిఎండిఆర్ ఎఫ్)నుండి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపింది. గాయపడిన వారికి ఎస్‌డిఎంఎ నిధి కింద కేటాయించిన మొత్తాన్ని ఇవ్వనున్నారు. అదనంగా సిఎండి ఆర్ ఎఫ్ నుండి రూ.2లక్షలు అత్యవసర ఆర్థిక సహాయం కింద అందించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గాయపడిన వారి చికిత్స ఖర్చులను ఆరు నెలల పాటు ప్రభుత్వం భరించనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా సిఎండిఆర్‌ఎఫ్ నుండి కేటాయిస్తారు. అదనంగా, విపత్తు ప్రతిస్పందన నిధి నుండి అనుమతించబడిన మొత్తాన్ని వైద్య సహాయంగా అందిస్తారు. ఒకవేళ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం చికిత్స అవసరమైతే, సిఫార్సు చేయబడిన ప్రైవేట్ ఆసుపత్రులలోని చికిత్స ఖర్చులను వైద్య మండలి నిర్ణయం ఆధారంగా సీఎండీఆర్‌ఎఫ్ నుండి కేటాయించనున్నట్లు వెల్లడించింది. ప్రమాదం అనంతరం గాలింపు, సహాయక చర్యలను సులభతరం చేసేందుకు ఆ ప్రాంతంలోని ప్రైవేట్ గోడలను కూల్చివేయడంతో పాటు వరి పొలాలను చదును చేసి పూడ్చివేయాల్సి వచ్చింది. గోడల పునరుద్ధరణ కోసం అయ్యే ఖర్చును, రైతులకు పరిహారాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా విపత్తు ప్రతిస్పందన నిధి నుండి కేటాయించనున్నారు.

# మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

- చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత
- మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం



హైదరాబాద్, ఏప్రిల్ 22: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్ప కాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

## వెంటనే సమ్మె విరమించి రండి

### ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



హైదరాబాద్, ఏప్రిల్ 22: ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

# హైకోర్టు తీర్పుతో బుద్ధి తెచ్చుకోవాలి

## కాంగ్రెస్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవు



హైదరాబాద్, ఏప్రిల్ 22: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు తీర్పును చూసైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్ఎస్ , కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ వాడుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌ను రెండున్నరేళ్లు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారు. చివరకు గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మీద చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై ఆయన హర్షణీయం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

## ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం



హైదరాబాద్, ఏప్రిల్ 22: ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీ ఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నా రన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘోష్ కమిషన్‌ను పక్కన పెట్టిన హైకోర్టు

- న్యాయం గెలిచినట్లేనన్న పద్మాదేవేందర్



మెదక్,ఏప్రిల్22 : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్టేనని ఆమె పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పునిదర్శనమనిపద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

# రెండు రాష్ట్రాల్లో భారీగా నగదు, మద్యం, నగలు పట్టివేత

## దాదాపు వేయికోట్ల విలు వుంటుందని ఇసి వెల్లడి




న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ధనం, మద్యం, ఉచితాలతో ఓటర్లను ప్రలోభపెడుతుండటం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ప్రలోభాలపై ఈసీ డేగకన్ను వేస్తుంటుంది. తాజాగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1,000 కోట్లకు పైగా విలువచేసే నగదు, మద్యం, డ్రగ్స్, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పశ్చిమబెంగాల్‌లో రూ.472.89 కోట్లు, తమిళనాడులో రూ.599 కోట్లు విలువచేసే నగదు, మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, ఉచితాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. ఇందులో రూ.127.67 కోట్ల నగదు, రూ.106.3 కోట్ల విలువైన మద్యం, రూ.184.83 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.215.19 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.437.97 కోట్ల విలువైన ఇతర ఉచితాలు ఉన్నట్టు ఈసీ తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 23న జరుగనుంది. తమిళనాడులో ఒక విడతలో పోలింగ్ జరుగనుండగా, బెంగాల్‌లో రెండు విడతలుగా జరుగునుంది. అక్కడ రెండో విడత పోలింగ్ ఈనెల 29న ఉంటుంది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో పాటు ఇప్పటికే పోలింగ్ పూర్తయిన అస్సాం, కేరళ, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఇడి విచారణలో జోక్యం చేసకోవడమేంటి?

మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నా రంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు. ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మమతాబెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు కోర్టుకు వెల్లడించారు. 2021 నుంచి టీఎంసీ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోన్న సంగతి తెలిసిందే.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్చిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు ఫిల్లర్లు కాదని.. మొత్తం పౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు.

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

ఘోష్ కమిషన్ నివేది కకు సంబంధించి బుధవారం తెలంగాణ హై కోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శిం చారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'డూప్గ ÷టింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

## ఉద్యోగిగా ఉంటూ వైసిపికి ప్రచారం

- 2024లోనే వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్
- మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు



**అమరావతి, ఏప్రిల్ 22 :** గత వైసీపీ ప్రభుత్వ హయాం లోనే ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్య క్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిపై చర్యలు ప్రారంభమ య్యాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు తెలిపారు. '2024లో ఆయనను సస్పెండ్ చేసింది మీ ప్రభుత్వమే' అని వైసిపికి గుర్తుచేశారు. 2024 ఎన్నికల సమయంలో వెంకట్రామిరెడ్డి వైసీపీ జెండాలు పట్టుకుని ప్రచారం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. బద్వేల్ రిటర్నింగ్ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగానే అప్పట్లో వెంకట్రామిరెడ్డిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి రాజకీయ ప్రచారంలో పాల్గొనడం 'కండక్ట్ రూల్స్'కు విరుద్ధమని.. అందుకే డిస్మిస్ చేశారని అశోక్ బాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగష్టులో జరిగిన విచారణలో వెంకట్రామిరెడ్డి నేరం చేసినట్లు రుజువైందన్నారు. వెంకట్రామిరెడ్డి అరాచకాలు, నిబంధనల ఉల్లంఘనలన్నీ జీఓ 464లో స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా చంద్రబాబు తప్పు చేస్తున్నారంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. ఉద్యోగులకు రూ.30 వేల కోట్లు బాకీ పెట్టి, జీతాలు సకాలంలో ఇవ్వని వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదని అశోక్ బాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పు చేశారంటూ జగన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఏబీ వెంకటేశ్వరరావు, ఎల్వీ సుబ్రహ్మణ్యం వంటి అధికారులను వేధించింది మరిచిపోయారా అని నిలదీశారు. ఉద్యోగులను బెదిరించి దేశంలో ఎక్కడా లేని విధంగా రివర్స్ పీఆర్సీ ఇచ్చిన ఘనత జగన్‌దే అంటూ దుయ్యబట్టారు. కూటమి పాలనలో ఇప్పటికే ఉద్యోగులకు రూ.22,000 కోట్ల మేర బకాయిలు చెల్లించామని చెప్పారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు పాల్పడి పబ్లిక్ స్థలాలను కూడా అమ్మేసుకున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని ఆరోపించారు. వెంకట్రామిరెడ్డి కుటుంబం మొత్తం వైసీపీ కార్యకర్తలే అని.. ఆయన భార్య ముషీరాబాద్ టికెట్ అడిగిన విషయం నిజం కాదా అని అశోక్ బాబు ప్రశ్నించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు చనిపోతే పట్టించుకోని జగన్.. ఉద్యోగుల పాలిట 'నరకాసురుడు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పిఠాపురం ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్

- మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం
- వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం




**అమరావతి, ఏప్రిల్ 22 :** పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

## కులాల మధ్య చిచ్చుతో రాజకీయ పబ్బం

### ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి


**రాజమండ్రి, ఏప్రిల్22 :** రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించి.. రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోం దని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. 'కులాల మధ్య చిచ్చు పెడుతుంటే మేము చూస్తూ ఊరుకోం.. రాజకీయంగా పతనం కావడంతోనే జగన్ ఇలాంటి అరాచకాలకు తెరలేపారు' అని ఆయన విమర్శించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కాపు సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యలను బ్లూ మీడియా ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిందని ఆయన మండిప డ్డారు. ఇప్పటికే సాక్షి పత్రికై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లా డుతూ..'రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్నాం.అంబటి అయినా గింబటి అయినా ఎవరై నా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. నా వ్యాఖ్యలను సాక్షి పత్రిక వక్రీకరించింది. జగన్ ఒక 'సూసైడ్ స్క్వాడ్'ను తయారు చేశారు. విచ్ఛిన్న శక్తులకు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా మారింది. దేవాలయాలు, వ్యక్తుల పైనా దాడులు చేయిస్తున్నారు. జక్కంపూడి రాజా లాంటి వాళ్ళను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి. మాజీ ఎంపీ మార్గాని భరత్ రాజమండ్రి కంబాల చెరువు, దేవిచౌక్ ప్రాంతాలను అభి వృద్ధి పేరుతో కంపుకొట్టించారు. కుర్రాళ్లు వాస్తవాలు తెలు సుకొని రాష్ట్ర భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తు న్నారు. సిగ్గులేకుండా ఇసుక గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలకు దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసురుతున్నా.' అని అన్నారు.

## హామీలను నెరవేరుస్తూ..అభివృద్ధి

### ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం,ఏప్రిల్22 :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ 22 నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ రూ.1.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, పుల్లలరేవులో రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారం భించారు. నియోజకవర్గంలో చేపట్టిన అన్నిపనులను పూర్తి చేస్తున్నా మని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ 22 నెలల్లోనే రాప్తాడు మండలంలో రూ.26 కోట్లతో రోడ్లు వేశామన్నారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ తారు రోడ్డు నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

## రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్




- అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్
- నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 22 :** ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యూవబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ఎ÷-లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గం లో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ఎ÷-లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా? ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది. ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్- రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు.

# కాళేశ్వరం పై సీబీఐ విచారణకు సిద్ధమా

- నిజాయితీ ఉంటే ముందుకు రండి
- బీఆర్ఎస్ నాయకత్వానికి

**మంత్రి పొంగులేటి సవాల్**

**బలగం టీవీ, హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్ట్ లో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు 'క్లీన్ చీట్' ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తీవ్రంగా విమర్శించారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనకడుగు వేస్తోందని, భారీ ఆర్థిక దోపిడీ, కమిషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ప్రకటనలో ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యతపై ఇప్పటికే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాలు కుంగిపోవడం, పంప్ హౌజ్‌లు దెబ్బతినడం వంటి సంఘటనలు యాదృచ్ఛికం కాదని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రాజెక్టులో జరిగిన పెద్ద ఎత్తున అవినీతికి నిదర్శనాలేనని



పేర్కొన్నారు. నాటి టీఆర్ఎస్

ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత దెబ్బతిందని, అదే విధంగా నిర్మించిన చెక్ డ్యాములు కూడా కుప్పకూలిన ఘటనలు ప్రజల ముందు ఉన్న వాస్తవాలేనని మంత్రి గుర్తు చేశారు.లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదన్నట్టుగా గ్లోబల్ ప్రచారానికి దిగడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, ఇది టీఆర్ఎస్ పాలనలో పెరిగిన మాయాజాల రాజకీయాలే అని విమర్శించారు. నిజాన్ని దాచేందుకు ప్రచార యంత్రాంగాన్ని వినియోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకత్వం, ముఖ్యంగా కేసీఆర్ మరియు కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, విచారణ నుంచి ఎందుకు తప్పించుకుంటున్నారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్ట్ పై పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరగడం ప్రజాస్వామ్యంలో కనీస బాధ్యత అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. నిజం మీవైపు ఉంటే విచారణకు ముందుకు రావాలని లేకపోతే మీ భయం మీ తప్పును నిరూపిస్తుందన్నారు.

# ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు..



- వివరణ కోరిన కేంద్ర ఎన్నికల సంఘం

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'టెర్రరిస్టు' అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసు పంపింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నందున ఆయనపై చర్య తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందిగా

ఆదేశించాలని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈసీకి బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే వివరణ కోరుతూ ఎన్నికల కమిషన్ నోటీసు ఇచ్చింది. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని బీజేపీ ప్రతినిధుల బృందంలోని నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈసీకి ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో పాటు భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 175 కింద నేరమవుతుందని, పరువునష్టం కేసు వేసేందుకు అవసరమైన ప్రాథమిక సాక్ష్యంగా ఆయన వ్యాఖ్యలు నిలుస్తాయని ఈసీ దృష్టికి తెచ్చారు. అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై ఖర్గే తమిళనాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందని ప్రశ్నించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని విమర్శించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించడంతో ఆయన తిరిగి వివరణ ఇచ్చారు. మోదీని తాను ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదని, ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ఈసీఐని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కలిసినట్టు చెప్పారు. ఎంతో బాధ, ఆగ్రహంతో తాము ఇక్కడకు వచ్చామన్నారు. ప్రధానమంత్రి మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అవమానించిన తీరే ఇందుకు కారణమని అన్నారు. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. దీనికి ముందు, ఖర్గే వ్యాఖ్యల వివాదంపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఒక లేఖ రాసింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం కిందకు వస్తుందని పేర్కొంది.

# తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

- ములుగు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షం

**బలగం టీవి, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు , వడగళ్ల వాన తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా తెలంగాణలోని ములుగు, ఏపీలోని నంద్యాల జిల్లాల్లో కురిసిన వానకు సామాన్య ప్రజలతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో భారీగా వడగళ్ల వాన కురిసింది. గాలుల ధాటికి పలు గ్రామాల్లో ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ప్రజలు భయంభ్రాంతులకు గురయ్యారు. ఏటూరునాగారం – కమలాపూర్ మార్గంలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేతికి వచ్చే దశలో ఉన్న మిర్చి, వరి పంటలు వడగళ్ల వానకు దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నంద్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలివాన ధాటికి వందల ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలపాలు కావడంతో రైతులు భారీగా నష్టపోయారు. రుద్రవరం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నేలకూలిన విద్యుత్ తీగలు, స్తంభాలతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. వాటిని తాకవద్దని అధికారులు సూచించారు. పంట నష్టపోయిన రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలిపాలని, ప్రభుత్వం నుంచి అందే సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. రాబోయే కొన్ని గంటల్లో మళ్లీ వర్ష సూచన ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

## గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి

# సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షల సాయం..

- కోమా స్థితిలో మాతృభూమిపై తుదిశ్వాస విడిచిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం
- మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి
- చొరవ చూపిన జి. చిన్నారెడ్డి, ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్


**బలగం టీవీ, జగిత్యాల:**

దుబాయి నుంచి కోమా (అపస్మారక స్థితి) లో తెలంగాణకు తరలింపబడి, చికిత్స పొందుతూ పదిరోజులు మృత్యువుతో పోరాడి మాతృభూమిపై తుదిశ్వాస విడిచిన జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, పొలాస గ్రామానికి చెందిన ఆరెల్లి గంగారాజం అనే గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది.

సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్, ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ లు మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్ లో మృతుడి భార్య ఆరెల్లి రాజవ్వకు చెక్కును అందజేశారు.

ఆరెల్లి గంగారాజం (61) కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై, 2025 నవంబర్ 12న దుబాయిలోని ఆస్టర్ హాస్పిటల్‌లో కోమా స్థితిలో చేర్చబడ్డారు. మెరుగైన చికిత్స కోసం డిసెంబర్ 14న హైదరాబాద్‌కు తరలించి, నిమ్స్‌లో చేర్చారు. అనంతరం రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొంది, చివరకు జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డిసెంబర్ 24న మరణించారు. జి.ఓ. నెం.216 ప్రకారం గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందజేస్తోంది. అయితే ఈ కేసులో మరణం భారత్‌లో చోటుచేసుకోవడంతో, 'మరణ స్థలం గల్ఫ్ దేశం అయి ఉండాలి' అనే సాంకేతిక నిబంధన కారణంగా ఆర్థిక సహాయం పొందడంలో ఆటంకం ఏర్పడగా... సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెల్లించి కుటుంబాన్ని ఆదుకున్నారు.

మానవతా దృక్పథంతో ప్రత్యేక కేసుగా పరిగణించి ?5 లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని మృతుడి భార్య రాజవ్వ, కుమారుడు జలంధర్ మార్చి 31న హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన "సీఎం ప్రవాసీ ప్రజావాణి" కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. మాకునూరి సంజయ్ కుమార్‌కు దరఖాస్తు ప్రతిని పంపించారు. అదే సమయంలో ప్రవాసీ ప్రజావాణి హెల్ప్ డెస్క్ ను సందర్శించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణల దృష్టికి ఈ సమస్య వచ్చింది. గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా




అన్నారు.

ప్రత్యేక కేసుగా పరిగణించి గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరును పరిశీలించాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి ని కోరుతూ డా. జి. చిన్నారెడ్డి దరఖాస్తుపై ఎండార్స్ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుతో ఫోన్ లో చర్చించి, ప్రభుత్వానికి డి.ఓ. లేఖ రాశారు. మృతుడి భార్య రాజవ్వ, కుమారుడు జలంధర్ లు ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి తో పాటు సెక్రటేరియట్ కు వెళ్లి సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు ను కలిసి ఆర్థిక సహాయం చెక్కు విడుదలలో కీలకంగా వ్యవహరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పేషెంట్ ను దుబాయి నుంచి స్వదేశానికి తరలించడం నుండి అన్ని రకాలుగా సహకరించిన జీఏడీ ఎన్నారై సెల్ సెక్షన్ ఆఫీసర్ కంచర్ల శ్రీనివాస రెడ్డి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ సమీనా బేగం, పి. రాజీవ్ కుమార్ లను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గల్ఫ్ కార్మిక కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డా. మాకునూరి సంజయ్ కుమార్, అధికార యంత్రాంగానికి పొలాస సర్పంచ్ మిల్యారి శంకరయ్య, డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్య లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## ఇటలీలో భారత ఎంబసీపై ఆరోపణలు ఖండన

**బలగం టీవీ, రోమ్**

ఇటలీలోని భారత రాయబార కార్యాలయం తనకు సహాయం చేయలేదని ఓ భారతీయుడు చేసిన ఆరోపణలను ఎంబసీ ఖండించింది. జతిన్ సరోహా అనే వ్యక్తి రోమ్‌లోని భారత ఎంబసీని సంప్రదించినట్లు అధికారులు తెలిపారు. పర్యావరణ అవగాహన కోసం మాల్టా నుంచి భారత్‌కు పాదయాత్ర చేస్తున్నానని, ఇప్పటికే 1500 కిలోమీటర్లు నడిచానని అతను సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నాడు. అయితే ఎంబసీ అధికారులు తనను లోపలికి అనుమతించలేదని ఆరోపిస్తూ వీడియోను పోస్టు చేశాడు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎంబసీ, అతను కార్యాలయానికి వచ్చినది నిజమేనని తెలిపింది. అయితే భద్రతా నిబంధనల ప్రకారం ఐడీ లేదా పాస్‌పోర్ట్ చూపించాలని కోరినా, అతడు నిరాకరించాడని వెల్లడించింది. ఎంబసీని సంప్రదించే ప్రతి వ్యక్తి కనీస భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. అతడు చేసిన ఆరోపణల్లో నిజం లేదని అధికారులు పేర్కొన్నారు.

## మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**ఈడీ విచారణలో జోక్యం సరికాదని వ్యాఖ్యలు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై భారత సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి విచారణల్లో ఇలా జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. మనీలాండరింగ్ కేసులో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహిస్తున్న దర్యాప్తులో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలపై న్యాయస్థానం స్పందించింది. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసును ఈడీ దర్యాప్తు చేస్తుండగా, విచారణలో జోక్యం జరుగుతోందని ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదని పేర్కొంది.ఇది రాష్ట్రం–కేంద్రం మధ్య వివాదంగా చూడరాదని, విచారణ ప్రక్రియను ప్రభావితం చేసే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు హెచ్చరించింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడా ఇలాంటి పరిస్థితిని ఊహించి ఉండరని కోర్టు వ్యాఖ్యానించింది.

# నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను వేగంగా ఢీకొన్న మరో కారు
- ముగ్గురు దుర్మరణం

**బలగం టీవి, హైదరాబాద్**

నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు.. బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శాకాజిపురానికి చెందిన బాల్‌రెడ్డి, అలివేలు, పాల్వాయి గ్రామానికి చెందిన మంజుల, వెంకటమ్మ నల్గొండలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వద్దిరెడ్డిగూడెం సమీపంలో అతి వేగం కారణంగా కారు ప్రమాదానికి గురైంది. ఓ బైకును ఢీకొట్టి కారు అదుపుతప్పింది. ఆ వెంటనే ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కనగల్‌కు చెందిన మధుబాబు, ధనుంజయ అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఉన్న బాల్‌రెడ్డి కూడా సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికులు ప్రమాదం గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# భార్యకు నిప్పంటించిన భర్త అరెస్ట్

- దుస్తుల విషయంలో వివాదం -- మహిళ పరిస్థితి విషమం

**బలగం టీవి, బెళగావి**

కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. దుస్తుల విషయంలో తలెత్తిన వివాదంతో భర్త తన భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన ఖానాపూర్ తాలుకాలోని నందగడ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రోజువారీ కూలీగా పనిచేసే కృష్ణాజీ పాటిల్ తన భార్య మంజులా పాటిల్ నైటీ ధరిస్తోందని తరచూ గొడవపడేవాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరుగుతుండగా, ఏప్రిల్ 19న ఉదయం 11 గంటల సమయంలో అద్దె ఇంట్లోనే మరోసారి తగాదా చోటుచేసుకుంది. కోపంతో కృష్ణాజీ తన భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. మంటలు అంటుకున్న వెంటనే బాధితురాలు అరవడంతో స్థానికులు స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో ఉన్న ఆమెకు సుమారు 80 శాతం కాలిన గాయాలు అయ్యాయని వైద్యులు తెలిపారు. తొలుత స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించగా, అనంతరం బ్రిమ్స్‌కు, తర్వాత మెరుగైన వైద్యం కోసం గోవాలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు కృష్ణాజీ పాటిల్‌ను ఏప్రిల్ 20న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# ఆర్టీసీ సమ్మె ప్రభావం.. మెట్రో సేవలు పెంపు

**బలగం టీవి, హైదరాబాద్**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో నగరంలో పెరిగిన ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు సేవలను పెంచుతున్నట్లు ప్రకటించారు. సమ్మె కాలంలో రోజుకు 56 మెట్రో రైళ్లను నడపాలని నిర్ణయించారు. మియాపూర్--ఎల్బీనగర్ మార్గంలో ప్రతి 4 నిమిషాలు 20 సెకన్లకు ఒక మెట్రో రైలు నడపనున్నారు. ఇదివరకు పీక్ అవర్స్‌లో మాత్రమే అధిక సర్వీసులు ఉండగా, ఇప్పుడు రోజంతా ఇదే వ్యవధిలో రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. నాగోల్--రాయదుర్గం మార్గంలో ప్రతి 3 నిమిషాలు 40 సెకన్లకు ఒక రైలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా నాన్-పీక్ సమయంలో తక్కువ సర్వీసులు ఉండగా, ప్రస్తుతం ఆ తగ్గింపును రద్దు చేశారు. ఇప్పటి వరకు వారపు రోజుల్లో ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు మాత్రమే 56 రైళ్లు నడిపేవారు. సమ్మె కారణంగా ఇప్పుడు రోజంతా పూర్తి స్థాయిలో సర్వీసులు కొనసాగించనున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సేవలను పొడిగించే అంశాన్ని ఎల్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్ పరిశీలిస్తోంది. నగర ప్రజలకు ఉపశమనం కలిగించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ తెలిపారు.




# సేవలోనూ మలబార్ సంస్థ ముందడుగు

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**బలగం టీవి, హైదరాబాద్**

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ వ్యాపారంలోనే కాదు సేవ చేసే గుణం లోను ముందడుగులో ఉందని, పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించడం గొప్ప విషయం అని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్', 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వారు ప్రకటించిన రూ. 200 కోట్ల సీఎస్ఆర్ నిధుల కేటాయింపులో భాగంగా తెలంగాణలోని 5,050 మంది విద్యార్థులకు రూ. 4.55 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మలబార్ గ్రూప్ చైర్మెన్ ఎం.పి. అహ్మద్‌తో కలిసి మంత్రి హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మలబార్ గోల్డ్ డైమండ్ గ్రూప్స్ ద్వారా వ్యాపార రంగంలోని నాణ్యతను చూపిస్తూనే పేద విద్యార్థులను ఆదుకొనడంలో ముందుండడం ఎంతగానో హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్య ఎంతో అవసరమని, ఆ విద్యను ఎటువంటి లాభాపేక్షం లేకుండా తమ చారిటీ ద్వారా పేదలకు అందించడం మలబార్ సంస్థలకు చెందిందన్నారు. విద్యార్థుల ఉన్నతమైన చదువులను ప్రోత్సహిస్తున్న ఇటువంటి సంస్థలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఇదేవిధంగా సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలవాలని కోరారు. మలబార్ గ్రూప్ చైర్మెన్ మాట్లాడుతూ వ్యక్తిగత సామాజిక స్థాయిలో దీర్ఘకాలిక ప్రభావాన్ని సష్టించడానికి విద్య అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. తమ స్కాలర్‌షిప్ కార్యక్రమాల ద్వారా, విజయం సాధించగల సామర్థ్యం ఉండి, చదువులను కొనసాగించడానికి ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థులకు మద్దతివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామ న్నారు. ఈ కార్యక్రమాల కోసం గ్రూప్ తన నికర ట్రేడింగ్ లాభంలో ఐదు శాతాన్ని కేటాయిస్తున్నదని తెలిపారు.హైదరాబాద్‌లోని తెలంగాణ స్కాలర్‌షిప్ కార్యక్రమంతో, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రాంతీయ మార్కెట్లలో విద్యపై దృష్టి సారించిన తమ సీఎస్ఆర్ ప్రయత్నాలను బలోపేతం చేస్తూనే ఉంది. తద్వారా విద్యార్థులకు నిర్మాణాత్మక స్థిరమైన మద్దతునందిస్తోంది. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# శంషాబాద్‌లో 9 ఎకరాలను కాపాడిన హైడ్రా

- రూ. 90 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం, గ్రామంలో 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. దీని విలువ రూ. 90 కోట్లకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నెంబర్ 626/2లో మొత్తం 176.05 ఎకరాల ప్రభుత్వ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉంది. అటవీ అభివృద్ధి సంస్థకు 166 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇంకా అక్కడ 9.05 ఎకరాల ప్రభుత్వ భూమి మిగిలింది. ఖస్రా పహాణీ( గ్రామ పాత రికార్డుల) ప్రకారం మొత్తం 176.05 ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో నమోదైంది. ఇందులోని 9.05 ఎకరాలను సీఎస్ 14 (నిజాంలకు చెందిన) భూములుగా పేర్కొంటూ కొంతమంది హక్కులు క్లైమ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మొత్తానికి ఈ వివాదం హైకోర్టులో పెండింగ్ ఉంది. తుది తీర్పు వచ్చే వరకూ ఈ భూమి స్వరూపాన్ని మార్చరాదని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే ఇచ్చింది. స్టేటస్ కో ఆర్డర్‌ను పట్టించుకోకుండా తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి ఆ భూమిని చదును చేసి లే ఔట్‌గా మార్చినట్టు రంగారెడ్డి కలెక్టర్‌తో పాటు, శంషాబాద్ మున్సిపల్ అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలించగా భూమిని చదును చేసి ప్రీకాస్ట్ గోడల ద్వారా ఆక్రమించినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం ఆక్రమణలను తొలగించాలని మొయినుద్దీన్‌కు సూచించారు. ఇవేవీ పట్టించుకోకుండా అక్కడ అతను కొన్ని ఇంటి స్థలాలు అమ్ముకున్నట్టు కూడా విచారణలో తేలింది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించాలని హైడ్రాకు లేఖ రాశారు. ఈ మేరకు బుధవారం హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించింది. చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసింది.



## సంఘం ఐక్యతకు నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది..

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

మున్నూరు కాపుల ఐక్యతకు మరియు సంఘ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు కళ్యాణ మండపాన్ని బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.?అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజంలో కులం అనేది ఒక పెద్ద బలం మరియు బలగం అని, అందరూ కలిసికట్టుగా ఉన్నప్పుడే సామాజికంగా ఎదగడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కళ్యాణ మండపం కేవలం భవనం మాత్రమే కాదని, ఇది ఆత్మీయతకు వేదికని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలు తమ శుభకార్యాలను తక్కువ ఖర్చుతో గౌరవప్రదంగా నిర్వహించుకోవడానికి ఈ మండపం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండప నిర్మాణానికి నిరంతరం కృషి చేసిన ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. . ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, సత్రం అధ్యక్షులు కోయినేని బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యతో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి

- **ఎస్పీ మహేష్ బి. గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు,యువకులు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువల వద్దకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుందని,ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నందున ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈత సరదా విషాదంగా మారకూడదు అని ఎస్పీ మహేష్ బి. గితే బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ఈత రానివారు బావులు, చెరువులు, కాలువల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని అన్నారు.ఈతను నేర్చుకునే వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే నేర్చుకోవాలని,ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.ఏదైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటే పిల్లల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు.





## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..

- **పాల్గొన్న సర్పంచ్ నరసింహులు, ఎంఈఓ కృష్ణ హరి**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కిషన్ దాస్ పేట్ లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా సర్పంచ్ ఎలగందుల నర్సింహులు, మండల విద్యాధికారి జి కృష్ణహరి పాల్గొన్నారు. మండల విద్యాధికారి కృష్ణ హరి మాట్లాడుతూ.. కార్పోరేట్ పాఠశాల లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నామని, విద్య తో పాటు, సహ పాఠ్య కార్యక్రమాలు, వివిధ ప్రొగ్రాం లు కార్పోరేట్ పాఠశాలలకు మించి నిర్వహించగల సత్తా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉందని, వచ్చే సంవత్సరం నుండి విద్యార్థులకు టిఫిన్ తో పాటు పాలు అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు ఉచిత విద్యని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు.

సర్పంచ్ నర్సింహులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలని వినియోగించుకోవాలని, పాఠశాల కు ఏ సమస్య ఉన్న ఉన్న తన దృష్టికి వస్తే పరిష్కరిస్తానని తెలిపారు.రిటైర్డ్ ఉపాధ్యాయులు గంప నాగేంద్రం, స్థానిక వార్డు మెంబర్ గాండ్ల ఆంజనేయులు పాఠశాల విద్యార్థులకు మెడల్స్, కార్యక్రమ నిర్వహణ ఖర్చుల కోసం 2000 రూపాయలు అందించారు. సర్పంచ్ గారు విద్యార్థులకు ఈ రోజు కు గాను చక్కని రుచికరమైన చికెన్ భోజనం కోసం 2500 అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సంపత్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నేవూరి మానస, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఒగ్గు మహేష్ చంద్ర, ఉపాధ్యాయులు నరేష్, రజిత, ప్రశాంత్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## విద్యాసంస్థల్లో విద్యార్థులకు పోటీలు..

**ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు విద్యాలయాల్లో విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు, గురుకుల విద్యాలయాలు, ఇతర రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చిత్రలేఖనం, క్విజ్, డిబేట్ ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి.. అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# సిరిసిల్లలో స్తంభించిన ఆర్టీసీ రవాణా..

**-సమ్మె బాటలో 240 మంది ఆర్టీసీ కార్మికులు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు సిరిసిల్ల లో ఆర్టీసీ సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. ఈ సమ్మె ప్రభావంతో సిరిసిల్ల డిపోకు చెందిన సుమారు 70 బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. విధులను బహిష్కరించిన 240 మంది ఆర్టీసీ కార్మికులు డిపో ముందు బైఠాయించి ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో తెల్లవారుజాము నుంచే బస్సు సర్వీసులు నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

?ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని అన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించకూడదని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరపకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.



# ప్రణాళిక ప్రకారం పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి..



- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**
- **జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో మాట్లాడిన కలెక్టర్**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

పోటీ పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు యువత, అభ్యర్థులు సిద్ధమవుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడారు. విద్యార్థతలు, ఏ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నారు? ఏ ఏ పుస్తకాలు చదువుతున్నారు? ఆరా తీశారు. రోజు ఎంత మంది లైబ్రరీకి వస్తారని గ్రంథాలయ అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అన్ని సబ్జెక్టులు ప్రణాళిక ప్రకారం.. ప్రతి అంశం క్షుణ్ణంగా చదవాలని సూచించారు. కరెంట్ అఫైర్స్, ఇతర అన్ని అంశాలపై మంచి అవగాహనతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాలు కూడా రిఫరెన్స్ గా తీసుకోవాలని సూచించారు.

# ప్రతి చిన్నారి సమతుల్య జీవనశైలి వైపు దారితీయడం లక్ష్యం

- **ఐసీడీఎస్ ఈవో వనిత**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని తిమ్మాపూర్, బాకూర్ పల్లి తండా గ్రామంలో బుధవారం గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఈవో వనిత పాల్గొని మేకల పూజితకు శ్రీమంతం నిర్వహించారు.

ఈవో వనిత మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 23 వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా గర్భవతులకు, బాలింతలకు ప్రతి చిన్నారి సమతుల్య జీవనశైలి పై వనిత అవగాహన కల్పించారు. స్క్రీన్ టైమ్ అధికంగా ఉంటే కలిగే హానికర ప్రభావాలు వివరించారు. తల్లిదండ్రుల పాత్రపై ప్రత్యేకంగా చర్చించారు. సేఫ్ డిజిటల్ హ్యాబిట్స్ అవగాహన వయస్సుకు అనుగుణంగా స్క్రీన్ టైమ్ పరిమితులు వివరించాలని భోజనం సమయంలో, నిద్రకు ముందు మొబైల్ వినియోగం నివారించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని, వీడియో సందేశాల ప్రసారం, స్క్రీన్ టైమ్ హానులపై వీడియోలు ప్రదర్శించారు.

సురక్షిత వినియోగం పై సందేశాలు పంచాలని, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, చదవడం, కథలు చెప్పడం, ఆటలు ఆడించడం ప్రోత్సహించారు అవుట్‌డోర్ యాక్టివిటీస్ ప్రోత్సహించాలని, కుటుంబంతో కలిసి సమయం గడపడం పై దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. పిల్లల అభివృద్ధిలో సమాజ పాత్ర, గ్రామ పెద్దలు, టీచర్లు, అంగన్వాడి సిబ్బంది పాఠశాలలు, పంచాయతీలతో కలిసి కార్యక్రమం నిర్వహించారు, సరళమైన భాషలో తల్లిదండ్రులకు వివరించాలని, చర్చల్లో పిల్లలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఫోటోలు, వీడియోలు తీసి గ్రూపుల్లో అప్లోడ్ చేసారు. తల్లిదండ్రులతో తిరిగి సంప్రదించి మార్పులు పరిశీలించాలన్నారు. చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టి



పెట్టాలని, స్క్రీన్ వినియోగాన్ని పర్యవేక్షించాలని, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. మనందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఐసిడిఎస్ ఈవో వనిత కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు జయశ్రీ, ఎంఎల్ హెచ్పి శిల్ప, అంగన్వాడి టీచర్ వనిత, ఆశా వర్కర్ జల్లి తార, ఐసిపిఎస్ భార్గవి, ఉపాధ్యాయులు వనజ, శ్రీజ, చిన్నారుల తల్లులు మమత, దేవవ్వ, రాజవ్వ, నర్సవ్వ పూజిత అనిత లు పాల్గొన్నారు.

# పాల కేంద్రం వద్ద పాడి రైతుల నిరసన..



- **కరీంనగర్ డైరీ నిర్వాహకులపై పాడిరైతులు ఆగ్రహం**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

కరీంనగర్ డైరీ నిర్వాహకులు పాడిరైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ పాలు కింద పోసి నిరసన తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన పాల కేంద్రంలో గ్రామంలోని దాదాపు 70 మంది పాడి రైతులు ఉదయం సాయంత్రం పాలను కేంద్రంలోకి తీసుకెళ్లి విక్రయిస్తుండగా, గత కొన్ని నెలల క్రితం నుండి వెన్న శాతం తక్కువ వస్తుందని చెప్తూ తక్కువ ధర చెల్లించడంతో పై అధికారులకు పిర్యాదు చేయగా పాల సేకరణ యంత్రం మరమ్మత్తు చేయించి ఇక నుండి సమస్య రాదు.. అని చెప్పగా కేవలం నాలుగు రోజులు మాత్రమే పాలను తీసుకొని సరైన డబ్బులు చెల్లించారని, మళ్ళీ రెండు రోజుల నుండి మళ్ళీ వెన్న శాతం రావడం లేదని డబ్బులు తక్కువ ఇవ్వడంతో ఆగ్రహం చెందిన పాడి రైతులు పాల కేంద్రం వద్ద నిరసన తెలిపి, పాలను పారబోసి రైతులను మోసం చేస్తున్న కరీంనగర్ డైరీపై చర్యలు తీసుకోవాలని కోరారు.కాగా అక్కడికి వచ్చిన సూపర్ వైజర్ నవీన్ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళతాని చెప్పారు.

# నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల భారీ సైకిల్ ర్యాలీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

అంతర్జాతీయ మదర్ ఎర్త్ డేను పురస్కరించుకుని, ప్రభుత్వ "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో ని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 8:00 గంటలకు పాఠశాల ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ మరియు జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య జెండా ఊపి ప్రారంభించారు. సుమారు అరగంట పాటు సాగిన ఈ యాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. గాలి, నీరు, నేల కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. ఇంధన ఆధారిత వాహనాల వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాల వాడకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు.

జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య మాట్లాడుతూ.. మన పూర్వీకులు మనకు అందించిన స్వచ్ఛమైన భూమిని, అంతే పవిత్రంగా రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆధునీకరణ మరియు యాంత్రీకీకరణ వల్ల పెరిగిపోతున్న కాలుష్యకారకాలు మానవ




మనుగడకే ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత అలవాట్లను ప్రోత్సహించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుత్తికొండ రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాస్ రావు, ఇప్పకాయల ప్రకాష్, ఎస్ కె మోహియోద్దీన్, విశ్వనాథ శరత్ బాబు, మేకల గంగారాం, మహేశుని కరుణశ్రీ, ఈర్లపల్లి భూమేశ్, పత్తెం పద్మ, వొల్లాల హరితశ్రీ, అలువాల కుమార్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు..

- **బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నల్ల మోహన్ వార్డు సభ్యులతో కలిసి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎండాకాలం కావడంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు బస్టాండ్ లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ పనులకోసం మండల కేంద్రానికి వచ్చే వారికి, ప్రయాణికులకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని అన్నారు. అనంతరం గ్రామంలో వేసవిలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలోని రైతుల బావులనుండి నీరు తీసుకొని గ్రామంలో సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా పలు భావులను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు బొజ్జ నరేందర్, దూస శ్రీనివాస్, నాయకులు మెరుపుల జలంధర్, మెరుపుల గంగాధర్, వాసల శ్రీనివాస్,బొడ్డు తిరుపతి, భీమనాథ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు తాగునీటి కష్టాలు రానీయొద్దు..



**● కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**
వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలకు నిత్యం తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, నీటి పారుదల మరియు పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

?ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రానున్న 45 రోజులు ఎంతో కీలకమని, ఎండలు తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు . ప్రతి మున్సిపాలిటీలోని వార్డులు, విలీన గ్రామాలు మరియు ప్రతి పల్లెలోని చివరి ప్రాంతం వరకు నీరు అందేలా పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలని, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు మరియు ఇన్ టెక్ వెల్స్ వద్ద మోటార్లు నిరంతరం పనిచేసేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

?ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడం కోసం రోజూ క్లోరినేషన్ చేయాలని, ప్రతి పది రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. నీటి మట్టాలను గమనిస్తూ నీటి పారుదల శాఖతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే స్థానిక వనరులను కూడా వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే అమృత్ పథకం కింద చేపట్టిన ఓ హెచ్ ఎస్ ఆర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ అమరేందర్, ఈఈలు అన్వర్, సుమలత, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలి...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశించారు.

కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అటవీ శాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి బుధవారం హాజరయ్యారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల అనుమతులు త్వరితగతిన జారీ చేయాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని, ఇందుకు సంబంధించి టీజీ-ఐపాస్ కింద వచ్చే దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొని, టీజీ-ఐపాస్ మరియు టీ-ప్రైడ్ పథకాల పురోగతిపై సమీక్షించారు.?ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకునేలా చూడాలని సూచించారు. టీ-ప్రైడ్ పథకం కింద అందిన 27 దరఖాస్తులకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా టీజీ-ఐపాస్ కింద అందిన 49 దరఖాస్తులలో ఇప్పటివరకు 31 అనుమతులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, నిబంధనలకు లోబడి వాటిని తక్షణమే క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.?నూతన పరిశ్రమల ఏర్పాటుతో జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగి, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**బలగం, బోయినపల్లి;**
బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మంగళవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ మాట్లాడుతూ లీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు,రికార్డులను సమగ్రంగా పరిశీలించి,కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా,పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి,చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లపై,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను కఠినతరం చేయాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ సమగ్ర భద్రతను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ, ప్రజలతో మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తెలియని కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటిపి లను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తు, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, వాహనదారులుకు హెల్మెట్ , సిట్‌బెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలు,మైనర్ డ్రైవింగ్ లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రజలకు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను, వ్యాపారస్తులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. స్టేషన్



పరిధిలో గంజాయి,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసు,సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

# అంతరాయం లేని విద్యుత్ సరఫరానే లక్ష్యం



**● ఎస్ఈ వేణు మాధవ్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట,**
వినియోగదారులకు, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాజన్న సిరిసిల్ల జిల్లా సూపెరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణు మాధవ్ అన్నారు . బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 132 ఖు విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎస్ఈ వేణు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్, ఆయిల్ లెవల్స్ మరియు కూలింగ్ సిస్టమ్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.?అనంతరం ఎస్ఈ ఎస్ఈ వేణు మాధవ్ మాట్లాడుతూ, ఎండాకాలం దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరుగుతుందని, దానికి అనుగుణంగా రైతులకు మరియు సామాన్య ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. బ్రేకర్లు, బ్యాటరీ సెట్స్ నిర్వహణ బాగున్నప్పటికీ, చిన్నపాటి సాంకేతిక లోపాలు తలెత్తిన వెంటనే స్పందించి సరిదిద్దాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్ మెన్లు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ఏమరపాటుగా ఉండవద్దని హెచ్చరించారు.?సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ ఇంజనీర్ వెంకట రమణ, సబ్ ఇంజనీర్లు మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లిఖార్జున ఖర్గే దిష్టి బొమ్మను దహనం చేసిన బీజేపీ నాయకులు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు భారత ప్రధాని నరేంద్ర మోధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిస్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ప్రధానినరేంద్ర మోధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసే వారు ఎవరయినా తాము ఊరుకునేది లేదనీ భారతీయ జనతా పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎల్లారెడ్డిపేట మండలం బిజెపి అధ్యక్షుడు రేపాక రామచంద్ర రెడ్డి తో పాటు ఉపాధ్యక్షులు భైరగోని బాల గౌడ్ , మల్లారపు మహేష్,ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షులు గంట బాలకృష్ణ, బి జె వై ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుక కుమార్ యాదవ్ , మండల అధ్యక్షులు జితేందర్ రెడ్డి, జిల్లా ఐ టి ఇంచార్జి ప్రకాష్, సీనియర్ నాయకులు కొత్తపెల్లి ఆంజనేయులు, గడ్డం రవి,నేవూరి శ్రీనివాస్ రెడ్డి, అంతరుపుల తిరుపతి, పారిపల్లి సంజీవరెడ్డి, సాయి కిరణ్ నాయక్, దేవుని గుట్ట తండా ఉప సర్పంచ్ రమేష్ నాయక్, కార్యకర్తలు శ్రీధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరానికి "బెస్ట్ అవైలబుల్ స్కూల్" నందు ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ 3, 5 మరియు 8వ తరగతులలో మొత్తం 11 సీట్లు (లంబాడ, ఎరుకల వర్గాలకు) కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలలోపు ఉండాలని,?ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు కరీంనగర్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను కుల, ఆదాయ, పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికేట్లు మరియు ఆధార్ కార్డు నకళ్లతో మే 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని తెలిపారు . మే 14న లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని,వివరాలకు 95026 64044 లేదా 99599 14511 నంబర్లలో సంప్రదించగలరని తెలిపారు.



## దళారులను నమ్మి మోసపోవద్దు.. మద్దతు ధర పొందండి..

**● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**బలగం టీవీ, బోయినపల్లి :**
రాష్ట్రంలోని రైతులను రాజులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అన్నదాతలు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు . బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు తడగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని కోరారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు . రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందు, ఎమ్మెల్యే స్తంభంపల్లి గ్రామంలో పర్యటించారు. అక్కడ రూ. 24 లక్షల దేవాదాయ శాఖ నిధులు, రూ. 6 లక్షల ప్రజల విరాళాలతో మొత్తం రూ. 30 లక్షలతో నూతనంగా పునర్నిర్మిస్తున్న శ్రీ సుగ్రీవ స్వామి ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక రంగానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పురాతన ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## అనంతారంలో విద్యుత్ సమస్యలను పరిష్కారించిన అధికారులు

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అనంతారం గ్రామంలో "ప్రజా బాట"కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను పరిశీలించి,వినియోగదారుల వద్దకు వెళ్లి తక్కువ వోల్టేజ్, బిల్లులు,లూజ్ వైర్లు వంటి సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వొల్లల రజిత వెంకటేశం మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కారం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఈ నగేష్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ నగేష్, లైన్ మెన్‌లు, హెల్పర్లు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవెంకటేశ్వర ఆలయంలో భగవద్గీత శ్లోకాల గడియారం అందజేత...

**బలగం, బోయినిపల్లి;**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి తడగొండ గ్రామ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజున స్వాముల సమక్షంలో భగవద్గీత శ్లోకాలతో సమయం తెలిపే పరికరాన్ని అందజేశారు. స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా వారి కుటుంబాలపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు బుర్ర రాజు,గోగురి చంద్రారెడ్డి,ఉయ్యాల బాలరాజు,బొడ్డు రమేష్,బుర్ర కనకయ్య,ముద్దాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## ముస్తాబాద్ మండల పాస్టర్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా సామ్యూల్**

**బలగం టీవీ, ముస్తాబాద్:**
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనది. జిల్లా పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్ ఇండియా, ప్రధాన కార్యదర్శి రాజేష్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాస్టర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముస్తాబాద్ మండల పాస్టర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎం సామ్యూల్, ఉపాధ్యక్షులుగా పౌల్, ట్రెజరర్ గా యాకోబ్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కార్యదర్శిగా ప్రశాంతులను ఎన్నుకున్నట్లు తెలిపారు. క్రైస్తవ సమాజాన్ని ఐక్యతతో నడిపించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు నతనియల్, ఆహారోను, ప్రసాద్, జోసెఫ్, దేవానంద్, పౌల్, పాస్టర్ ఏసుదాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఐసీసీ జనరల్ మేనేజర్ పదవి నుంచి వైదొలిగిన వాసిమ్ ఖాన్

### నాలుగేళ్ల సేవలకు ముగింపు -- జూన్‌లో కొత్త బాధ్యతల అవకాశం

**బలగం టీవి, న్యూఢిల్లీ**



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాజీ సీఈవో వాసిమ్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌లోని జనరల్ మేనేజర్ పదవికి రాజీనామా చేశారు. గత నాలుగేళ్లుగా ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన తాజాగా పదవికి వీడ్కోలు పలికారు. 2022లో జెఫ్ అల్లార్డైస్ నుంచి బాధ్యతలు స్వీకరించిన వాసిమ్ ఖాన్, అంతకుముందు 2019 నుంచి మూడేళ్లపాటు పీసీబీ సీఈవోగా సేవలందించారు. ఐసీసీ పదవికి రాజీనామా చేసినప్పటికీ, జూన్ నెలాఖరులో మరో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

ఇటీవలి కాలంలో ఐసీసీలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జెఫ్ అల్లార్డైస్‌తో పాటు యాంటీ కరప్షన్ యూనిట్‌కు చెందిన క్రిస్ టెట్లీ, అలెక్స్ మార్షల్ వంటి పలువురు ఉన్నతాధికారులు తమ పదవులను వీడారు. వారి స్థానాల్లో గౌరవ్ సక్సేనా, ఆండ్రూ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఇంగ్లాండ్‌లో జన్మించిన వాసిమ్ ఖాన్ అక్కడే తన క్రికెట్ కెరీర్ ప్రారంభించారు. 1995 నుంచి 2001 వరకు ఫస్ట్ క్లాస్ క్రికెట్, 1998 నుంచి 2002 వరకు లిస్ట్–ఏ మ్యాచ్‌ల్లో ఆడారు. 1995లో వార్విక్‌షైర్ కౌంటీ టైటిల్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నారు. పాకిస్థాన్ మూలాలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో పాక్ తరఫున ఆడలేదు. అయితే పీసీబీ సీఈవోగా, ఐసీసీ జనరల్ మేనేజర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించిన వాసిమ్ ఖాన్ క్రికెట్ పరిపాలనలో తనదైన ముద్ర వేశారు.



## బౌన్సర్ తాకడంతో బ్యాటర్ కుప్పకూలి మ్యాచ్ రద్దు

### ప్రమాదకర పిచ్ కారణంగా వెస్టిండీస్ దేశవాళీ మ్యాచ్ డ్రా

**బలగం టీవి, ఆంటిగ్వా**

వెస్టిండీస్ దేశవాళీ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో అరుదైన ఘటన చోటుచేసుకుంది. బౌలర్ వేసిన బౌన్సర్ బ్యాటర్ హెల్మెట్‌ను బలంగా తాకడంతో అతడు కుప్పకూలిపోవడంతో మ్యాచ్‌ను అధికారులు రద్దు చేశారు.

సర్ వివియన్ రిచర్డ్స్ మైదానంలో ట్రినిడాడ్ అండ్ టొబాగో బౌలర్ జేడన్ సీల్స్ వేసిన బంతి అనూహ్యంగా బౌన్స్ అయి లీవార్డ్ ఐలాండ్స్ బ్యాటర్ జెరిమియా లూయిస్ హెల్మెట్‌కు బలంగా తగిలింది. దీంతో అతడు వెంటనే నేలపై పడిపోయాడు. కొంతసేపటి తర్వాత లేచిన లూయిస్ అసహనంతో హెల్మెట్‌ను తన్ని మైదానాన్ని వీడాడు. ఘటన అనంతరం బ్యాటర్‌ను ఆస్పత్రికి తరలించి కాంకషన్ పరీక్షలు నిర్వహించగా, అతడు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఈ ఘటన సమయంలో ట్రినిడాడ్ బౌలర్ జేడన్ సీల్స్ అద్భుత బౌలింగ్‌తో ఏడు వికెట్లు సాధించాడు. లీవార్డ్ ఐలాండ్స్ జట్టు అప్పటికి 7 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. పిచ్ పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో మ్యాచ్‌ను వెంటనే నిలిపివేసి డ్రాగా ప్రకటించినట్లు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు వెల్లడించింది.



## సోదరుడితో విభేదాలపై కృనాల్ రియాక్షన్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్‌లో పాండ్య బ్రదర్స్ (కృనాల్– హార్దిక్) సందడి అంతా ఇంతా కాదు. ఈ సోదరులు ఇద్దరు తమ ప్రదర్శనతో ఈ లీగ్‌లో ఉత్తమ ప్లేయర్లుగా ఎదిగారు. కెరీర్ తొలినాళ్లలో ఈ ఇద్దరూ ముంబయి ఇండియన్స్‌కే ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఒక్కరు ఒక్కో టీమ్ కు ఆడుతున్నారు. అయితే ప్రత్యర్థులుగా బరిలోకి దిగినప్పటికీ పాండ్య బ్రదర్స్ స్పోర్ట్స్ స్పిరిట్ మెచ్చుకునేలా ఉంటుంది. మైదానం బయట కూడా వీళ్లద్దరూ ఇంకా ప్రేమగా ఉండేవారు. అయితే ఈ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు ఇటీవల ప్రచారం సాగుతోంది. మరోవైపు, కొంతకాలంగా ఈ ఇద్దరూ మునుపటిలా క్లోజ్?గా కూడా ఉండడం లేదు. కొన్ని నెలలుగా ఒకే ఫ్రేమ్?లో పాండ్య బ్రదర్స్ అసలు కనిపించింది లేదు. కనీసం సోషల్ మీడియాలోనైనా ఒకరినొకరు పలకరించుకున్నదీ లేదు. అయితే రీసెంట్?గా ముంబయి ఇండియన్స్– రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో కృనాల్ ఆర్సీబీకి, హార్దిక్ ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు ఎదురుపడ్డప్పుడు మాట్లాడుకుంటారేమో అని అభిమానులు ఎదురుచూశారు. కెమెరాలు కూడా వీళ్లిద్దర్నీ ఫోకస్ చేశాయి. కానీ మ్యాచ్ సందర్భంగా ఎదురుపడినప్పటికీ పాండ్య బ్రదర్ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య విభేదాలు నిజమేనని అంతా అనుకుంటున్నారు!

అయితే తమ సోదరుల మధ్య అంతా సవ్యంగా లేదన్న వార్తలపై కృనాల్ స్పష్టతనిచ్చాడు. తాజాగా అతడు ఆర్సీబీ ఇన్?సైడర్స్ మిస్టర్ నాగ్స్? ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో 'గతేడాది నువ్వు నా షోకు రాలేదు. అప్పుడు నేను ఫోన్ చేస్తే నువ్వు ఫ్యామిలో బిజీగా ఉన్నానని చెప్పావు. అంటే ఆర్సీబీ నీ ఫ్యామిలీ కాదా?' అని అడిగాడు. దీనికి కృనాల్ 'ఆర్సీబీ కూడా నా ఫ్యామిలీనే. నేను చెప్పాను కానీ నువ్వు సరిగ్గా విననట్లు ఉన్నావు. అయితే ఇంట్లో అనేకమంది ఫ్యామిలీ మెంబర్స్ ఉంటారు. కానీ ఒక్కోసారి ఒకరిని మిస్ అవుతాము' అని అన్నాడు. దీనికి నాగ్స్ వెంటనే 'మీ సోదరుడి లాగానే' అని అన్నాడు. దీనికి కృనాల్ నవ్వేశాడు. ఈ క్రమంలోనే తమ బ్రదర్స్ మధ్య అంతా సవ్యంగానే ఉందా? అని కృనాల్?ను నాగ్స్ అడిగాడు. ?"మీ ఇద్దరి మధ్య అంతా బాగానే ఉందా? లేదా ఏమైనా గొడవలు జరుగుతున్నాయా?" అని అడగ్గా, కృనాల్ ఒక్కసారిగా నవ్వేశాడు. అప్పుడు హోస్ట్ "కేన్, అండర్‌టేకర్ కూడా కొన్నిసార్లు గొడవ పడతారు అది కామనే" (రెజ్లర్లను ఉద్దేశించి) అని వ్యాఖ్యానించాడు. దీనికి "అంతా బాగానే ఉంది" అని కృనాల్ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య గొడవలు అన్న ప్రచారానికి ఫుల్? స్టాప్ పడినట్లే అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

## సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న రబాడ వీడియో

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న వేళ, మైదానంలో ఆటగాళ్ల మెరుపుల కంటే బయట వారు చేస్తున్న పనులు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ క్రికెటర్లు బహిరంగంగా సిగరెట్లు తాగుతూ దొరికిపోవడం క్రీడా వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇటీవల స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ సిగరెట్ తాగుతూ కనిపించగా, ఇప్పుడు సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కాగిసో రబాడ వంతు వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడ, ఒక చోట కూర్చుని దర్జాగా సిగరెట్ తాగుతున్న వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియో ఎక్కడిది అనే దానిపై క్లారిటీ లేనప్పటికీ, ఇది ఏదో ఒక హోటల్ లేదా స్టేడియంలోని ప్లేయర్స్ ఏరియాలో తీసినట్లు కనిపిస్తోంది. ఫిట్‌నెస్ మీద అత్యంత శ్రద్ధ చూపే అథ్లెట్లు ఇలా బహిరంగంగా ధూమపానం చేయడం పట్ల నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కూడా ఇలాంటి వివాదంలోనే చిక్కుకున్నాడు. తన లగ్జరీ బీఎండబ్ల్యూ కారును నడుపుతూ, కారు కిటికీలో నుంచి వెలుగుతున్న సిగరెట్‌ను బయటకు విసిరేస్తూ చాహల్ కెమెరాకు దొరికిపోయాడు. ఆ వీడియోను ఒక అభిమాని షూట్ చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో చాహల్ మీద విమర్శల వర్షం కురిసింది. ఇప్పుడు రబాడ కూడా అదే బాటలో నడవడంతో క్రికెట్ ప్రేమికులు పెదవి విరుస్తున్నారు. వివాదాలు పక్కన పెడితే, మైదానంలో మాత్రం రబాడ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో అతను 10 వికెట్లు పడగొట్టాడు. పర్పుల్ క్యాప్ రేసులో కూడా ముందు వరుసలో ఉన్నాడు. అయితే ఇటువంటి వీడియోలు బయటకు రావడం వల్ల అతడి ఇమేజ్‌తో పాటు జట్టు పేరు కూడా దెబ్బతినే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోపై మిశ్రమ స్పందన వస్తోంది. క్రికెటర్లు యువతకు రోల్ మోడల్స్ గా ఉండాలి.. ఇలాంటి పనులు చేయడం తప్పు అని కొందరు కామెంట్స్ చేస్తుంటే, "అది వారి వ్యక్తిగత విషయం, ఆట మీద దాని ప్రభావం లేనంత వరకు పర్వాలేదు" అని మరికొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఏది ఏమైనా, బీసీసీఐ, ఐపీఎల్ యాజమాన్యం ఇలాంటి విషయాల్లో కఠినంగా ఉండాలని మెజారిటీ అభిమానులు కోరుకుంటున్నారు.

# లక్నోపై రాజస్థాన్ ఘన విజయం

- 40 పరుగుల తేడాతో గెలుపు
- మార్ష్ పోరాటం వృథా
- రెండో స్థానానికి ఆర్ఆర్

**బలగం టీవి, లక్నో**



ఐపీఎల్--2026లో భాగంగా లక్నోలోని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజపేయి ఏక్నా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 40 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది.

టాస్ గెలిచిన లక్నో బౌలింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. జైస్వాల్ (22), హెట్మెయర్ (22), శివమ్ దుబే (19) కీలక పరుగులు చేయగా, రవీంద్ర జడెజా 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. లక్నో బౌలర్లలో మహమ్మద్ షమీ, ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ తలా రెండు వికెట్లు తీశారు. ముఖ్యంగా మూడో ఓవర్‌లో షమీ వరుస బంతుల్లో జైస్వాల్, ధ్రువ్ జురెల్ వికెట్లు పడగొట్టి రాజస్థాన్‌ను కట్టడి చేశాడు. అయితే చివరి ఓవర్‌లో మయాంక్ అగర్వాల్ 20 పరుగులు ఇవ్వడంతో స్కోరు 159కు చేరింది.

160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో జట్టు 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. మిచెల్ మార్ష్ 41 బంతుల్లో 55 పరుగులు చేసి పోరాడినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి ఓవర్లలోనే కీలక వికెట్లు కోల్పోవడం జట్టుకు చేటు అయింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు తీయగా, నాంద్రే బర్గర్, బ్రిజేష్ శర్మ తలా రెండేసి వికెట్లు తీశారు.

ఈ విజయంతో రాజస్థాన్ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. కాగా పంజాబ్ కింగ్స్ ఆరు మ్యాచ్‌లలో ఐదు విజయాలతో 11 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. బెంగళూరు, హైదరాబాద్ జట్లు తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

# ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలి

- టీమిండియా మాజీ క్రికెటర్లు



**బలగం టీవి, న్యూఢిల్లీ**

పాట్ కమిన్స్ వచ్చినా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్‌కు టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సంజయ్ బంగర్ సూచించారు. ఇషాన్ సారథ్యంలో జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుందని, ఆ మూమెంటమ్‌ను దెబ్బతీయవద్దని కోరారు.

వెన్ను గాయంతో పాట్ కమిన్స్ ఐపీఎల్ ఫస్టాఫ్ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న కమిన్స్.. జట్టుతో కలిసాడు. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్ వేదికగా జరిగే తమ తదుపరి మ్యాచ్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. కమిన్స్ రాకతో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ మార్పు జరుగుతుందా? లేదా? అనే సస్పెన్స్ నెలకొంది. ఈ వ్యవహారంపై జియో హాట్‌స్టార్ షోలో హర్భజన్ సింగ్, టీమిండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్ మాట్లాడారు. ఈ ఇద్దరూ ఇషన్ కిషన్‌నే సారథిగా కొనసాగించాలని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌కు సూచించారు. 'పాట్ కమిన్స్ తిరిగి వచ్చినా సరే.. ఇషాన్ కిషనే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కొనసాగించాలి. ఈ నిర్ణయం చర్చనీయాంశం కావచ్చు. కానీ జట్టు ఒక యువ నాయకుడికి మద్దతు ఇచ్చినప్పుడు.. అతనితోనే ముందుకు సాగాలి. బౌలర్లు, ఇతర ఆటగాళ్లు ఇషాన్ కిషన్‌తో మంచి సమన్వయాన్ని పెంచుకున్నాడు. ఇషాన్ కిషన్‌ను కెప్టెన్‌గా కొనసాగించడం వల్ల సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రయోజనం చేకూరుతుంది.'అని హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడని, కమిన్స్ రాకతో అతన్ని పక్కనపెడితే టీమ్ మూమెంటమ్ దెబ్బతింటుందని సంజయ్ బంగర్ హెచ్చరించాడు. 'సారథిగా ఇషాన్ కిషన్ తన బౌలర్లను సమర్థవంతంగా ఉపయోగించకుంటున్నాడు. ఏ బ్యాటర్ మీద ఏ బౌలర్‌ను ఉపయోగించాలనే విషయంలో అతనికి స్పష్టమైన అవగాహన ఉంది. ఇది అతను ఆటను ఎంత బాగా నియంత్రిస్తున్నాడో చెప్పడానికి ఒక నిదర్శనం. తీవ్ర ఒత్తిడిలో కూడా ఇషాన్ కిషన్ ఎలాంటి గందరగోళానికి గురికాకుండా.. తొందరపడకుండా మైదానంలో సరైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్లను ఉపయోగించిన తీరు అద్భుతం. పాట్ కమిన్స్ ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకున్నాడు. అతను ఏ మేరకు రాణిస్తాడో చెప్పలేం. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ కూడా ఇషాన్ కిషన్‌నే కొనసాగించాలనే యోచనలో ఉండవచ్చు.'అని సంజయ్ బంగర్ అభిప్రాయపడ్డాడు. మెజార్టీ అభిమానులు కూడా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని కోరుకుంటున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు మీద ఉంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానంలో కొనసాగుతోంది.

# ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై ధోనీకి మంచి రికార్డు ఉండటం ప్లస్ పాయింట్. ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.



## నికోలస్ పూరన్ ఎంపికకు అనుభవమే ప్రధాన కారణం


### లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్

**బలగం టీవి, లక్నో**

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నా.. నికోలస్ పూరన్‌ను ఆడించడానికి అతని అనుభవమే ప్రధాన కారణమని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో మార్పులు చేసినా నికోలస్ పూరన్‌ను పక్కన పెట్టలేమని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో సూపర్ జెయింట్స్ బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రిషభ్ పంత్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం. గతం గురించి పట్టించుకోకుండా ప్రస్తుత మ్యాచ్‌పైనే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాం. ముందుగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని అనుకుంటున్నాం. లక్నోలో పిచ్ కండిషన్స్ సవాల్‌గా ఉన్నాయి. ఈ ఛాలెంజ్‌ను మేం ఇష్టపడుతున్నాం. మా సొంతగడ్డపై ఎలా ఆడాలో మేం ఒక మార్గాన్ని కనుగొంటాం. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో స్వల్ప మార్పులు చేశాం. జట్టు స్థిరత్వం దెబ్బతినకుండా ఈ మార్పులు చేశాం. మా బౌలింగ్ విభాగంలో రెండు మార్పులు జరిగాయి.. సిద్ధార్థ్ స్థానంలో దిగ్వేష్ రతి, ఆవేష్ స్థానంలో మయాంక్ యాదవ్ జట్టులోకి వచ్చారు. నికోలస్ పూరన్‌ను తుది జట్టు నుంచి తప్పించలేం. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఆటగాడిని ఎలా ఆడినా నమ్మాలి. మా జట్టుకు అతను చాలా ముఖ్యం. నికోలస్ పూరన్ పట్ల మాకున్న ప్రేమ, కేర్ అలాంటిది.'అని రిషభ్ పంత్ తెలిపాడు. మరోవైపు టాస్ ఓడిపోవాలని కోరుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అన్నాడు. ఈ పిచ్ కండిషన్స్ నేపథ్యంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అయోమయంలో ఉన్నానని చెప్పాడు. టాస్ ఓడిపోయినందుకు సంతోషంగా ఉందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా చేయడానికి తాను సిద్ధమేనని తెలిపాడు. 'ఇక్కడ కొన్ని దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు ఆడాం. రెండో ఇన్నింగ్స్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదించవచ్చు. గత మ్యాచ్‌లో కోల్‌కతాపై మేము బాగానే బ్యాటింగ్ చేశాం. కానీ మిడిల్ ఓవర్లలో కొన్ని లెక్కలు తప్పాయి. అయితే జైస్వాల్, వైభవ్ బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతం. ఆ మ్యాచ్ కొన్ని తప్పులు జరిగాయి. మనం గెలవాలంటే 40 ఓవర్ల పాటు అత్యుత్తమ క్రికెట్ ఆడాలని మా ఆటగాళ్లకు చెప్పాను. ఈ రాత్రి అది చేస్తామని ఆశిస్తున్నాను. మేం అదే జట్టుతో బరిలోకి దిగుతున్నాం'అని రియాన్ పరాగ్ తెలిపాడు.

## దిల్షాన్ మదుశంక ఐపీఎల్ అరంగేట్రం

**బలగం టీవి, హైదరాబాద్**




సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతూ దిల్షాన్ మదుశంక మంగళవారం (ఏప్రిల్ 21న) ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతను తన దేశం శ్రీలంకకు చెందిన పథుమ్ నిస్సంకను అవుట్ చేయడం ద్వారా తన మొదటి క్ష్మీఐపీఎల్ వికెట్‌ను సాధించాడు. మదుశంక 4 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీశాడు. 2023లో భారత్‌తో జరిగిన ఒక మ్యాచ్‌లో ఏకంగా 5 వికెట్లు పడగొట్టాడు. అందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వికెట్లు కూడా ఉన్నాయి. దిల్షాన్ మదుశంకను సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా వేలంలో కొనుగోలు చేయలేదు. కానీ అతను రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా జట్టులోకి వచ్చాడు. విదేశీ ఆటగాడు బ్రైడన్ కార్స్ స్థానంలో రూ. 75 లక్షల మొత్తంతో మదుశంక సన్‌రైజర్స్ లో చేరాడు. అంతకుముందు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కారణంగా ముంబై ఇండియన్స్ గతంలో కొనుగోలు చేసింది. 2024లో ముంబై మదుశంకను రూ. 4.60 కోట్లకు కొనుగోలు చేసింది. గాయం కారణంగా మదుశంక ఆ ఏడాది ఐపీఎల్ అరంగేట్రం చేయకుండానే తప్పుకున్నాడు. దిల్షాన్ మదుశంక ( 2000 జనవరి 18న శ్రీలంకలోని హంబన్‌తోట నగరంలో జన్మించాడు. లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అయిన మదుశంక శ్రీలంక జట్టు తరఫున 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. మదుశంక 2022లో తన మొదటి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ సైతం ఆడాడు. 2023 జనవరి 10న వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశం లభించింది. అతని మొదటి మ్యాచ్ టీమ్ ఇండియాతో జరిగింది. ఇందులో ఒక వికెట్ తీశాడు. అయితే ఇప్పటి వరకు మదుశంక అత్యుత్తమ స్పెల్ భారత్‌పైనే నమోదైంది. లంక పేసర్ దిల్షాన్ మదుశంక 28 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఒకసారి ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అతని ఈ స్పెల్ భారత్‌తోనే టీమిండియాపై జరిగింది. 2023 నవంబర్ 2న వాంఖడేలో జరిగిన ఈ మ్యాచ్‌లో లంక పేసర్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ తో పాటు శ్రేయస్ అయ్యర్ వంటి దిగ్గజ బ్యాటర్లను అవుట్ చేసి 5 వికెట్ల హాల్ సాధించాడు. ఈ ఐదుగురు మ్యాచ్ విన్నర్లు కావడంతో మదుశంకతో మంచి గుర్తింపు లభించింది. మదుశంక తన కెరీర్‌లో లంక తరఫున 1 టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 50 వికెట్లు, టీ20ల్లో 20 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ కాకుండా మదుశంక పాకిస్థాన్ సూపర్ లీగ్ ), ఇంటర్నేషనల్ లీగ్ టీ20, లంక ప్రీమియర్ లీగ్‌లలో ఆడాడు. 17 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన మదుశంక 47 వికెట్లు తీశాడు. లిస్ట్ ఏ లోని 50 మ్యాచ్‌ల్లో అతని ఖాతాలో 92 వికెట్లు ఉన్నాయి. లీగ్, అంతర్జాతీయ మ్యాచ్‌లు కలిపి అతను మొత్తం 64 టీ20 మ్యాచ్‌లాడగా 62 వికెట్లు తీశాడు. ఏప్రిల్ 21న ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచులో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతడు మొదట ప్లేయింగ్ 11లో లేడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మొదట బ్యాటింగ్ కు దిగి నిర్ణీత ఓవరల్లో 242 పరుగుల భారీ స్కోరు చేసింది. బౌలింగ్ సమయంలో ట్రావిస్ హెడ్ స్థానంలో దిల్షాన్ మదుశంకను ఇంపాక్ట్ ప్లేయర్‌గా సన్‌రైజర్స్ బరిలోకి దించింది.

# సల్మాన్, వంశీపైడిపల్లి మూవీకి క్లాప్



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ఎస్‌వి63 ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది సల్మాన్ ఖాన్ కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోందని సమాచారం. ఇక మొదటిసారి సల్మాన్ ఖాన్‌ను వంశీ పైడిపల్లి డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.

# పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా? చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల్' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా? శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో? శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.

# చిరుతో బాబీ సినిమా



## నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.

# సిటాడెల్-2 సీజన్‌లో ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది.ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో ప్రియాంక చోప్రా బిజీగా ఉన్నప్పటికీ, ఆమె తన గ్లోబల్ ప్రాజెక్ట్ 'సిటాడెల్'తో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.




# కొత్త గృహంలోకి ప్రవేశించనున్న బన్నీ




## జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం.సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ నిర్మాణం తుదిదశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లో అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ నిర్మిస్తున్న ఈ కొత్త మేన్షన్ కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా నిలిచే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారబోతోందని అభిమానులు భావిస్తున్నారు.

